క్లుప్తంగా

డివిజన్ స్థాయి స్పందనకు 10 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్‌డీఓ సీతారామారావు

పెద్దాపురం: డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 11 అర్జీలు అందాయని పెద్దాపురం ఆర్‌డీఓ జె.సీ తారామారావు తెలిపారు. భూ తగాదా పరిష్కారం, శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న ఆక్రమణల తొలగింపు, భూ సర్వే తదితర సమస్యలపై 10 ఫిర్యాదులు అందాయని వివరించారు. ప్రతి అర్జీనీ ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఆర్‌డీఓ విలేకర్లకు చెప్పారు. ప్రతి అర్జీనీ పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, ఆర్‌డీఓ కార్యాలయం పరిపాలనాధికారి సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఏపీకి ద్వితీయ స్థానం



రెండో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో శంకర్, కోచ్‌లు

సామర్లకోట: అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం లభించిందని రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఇన్‌చార్జి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డి.శంకర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కరాటే పోటీలు జరిగాయని తెలిపారు. వీటికి రాష్ట్రం నుంచి 91 మంది విద్యార్థులను తీసుకు వెళ్లగా, మన దేశం నుంచి గుజరాత్ మొదటి, మన రాష్ట్ర జట్టు రెండో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లు సాధించాయని వివరించారు. రాష్ట్ర క్రీడాకారుల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన శంకర్‌ను లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తులూరి వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, సెకడ్ లయన్స్ క్లబ్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అభినందించారు.

నేడు నాలుగేళ్ల పాలన విజయోత్సవ బైక్ ర్యాలీ



దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన నాలుగు సంవత్సరాలైన సందర్భంగా మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి నియోజకవర్గంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ, సామర్లకోట వీధుల గుండా సాగి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం మీదుగా పెద్దాపురం చేరుతుందని తెలిపారు. అక్కడి నుంచి పెద్దాపురం మెయిన్ రోడ్డు మీదుగా సాగి, మున్సిపల్ కార్యాలయం వద్ద ముగుస్తుందని చెప్పారు.

8 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఐసీడీఎస్ సామర్లకోట రూరల్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి టి.దేవీరత్న పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కాకినాడ రూరల్, సామర్లకోట రూరల్, పెదపూడి పరిధిలో 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాకినాడ రూరల్ తూరంగి పగడాలపేట; సామర్లకోట రూరల్ పరిధి మాధవపట్నం, జి.కొత్తూరు, వీకే రాయపురం, వేట్లపాలెం (గాంధీనగర్), వేట్లపాలెం (చాకలిపేట), నవర కొత్త కాలనీల్లోను; పెదపూడి మండలం పెదపూడి చాకలిపేటలోను హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. రోస్టర్ ప్రకారం ఈ పోస్టుల భర్తీ చేపట్టనున్నామని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. విధిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని పద్మావతి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ దరఖాస్తులను సామర్లకోట రూరల్ ఐసీడీఎస్ పథక అధికారిణి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రతి క్షణం.. ప్రజా హితం

- గ్రామాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లు
- అవార్డులు అందిస్తున్న ప్రభుత్వం
- ఉప్పాడ పంచాయతీకి మూడేళ్లుగా వజ్ర అవార్డు
- మండలంలో 508 మందికి పారితోషికం



సేవా వజ్రాలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారు. పథకాలను సక్రమంగా చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచీ ప్రజలకు వలంటీర్లు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. వారిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు, సత్కారాలతో ప్రోత్సహిస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాలకు అనుసంధానంగా పని చేస్తున్న వలంటీర్ల పనితీరు ఆధారంగా వారికి నగదు పారితోషికం, సర్టిఫికెట్లు, బ్యాడ్జీలు, మెడల్స్ అందిస్తోంది. ఈ ఏడాది కూడా వలంటీర్లకు వందనం పేరుతో పురస్కారాలను అందజేస్తున్నారు. మండలంలోని 25 గ్రామ సచివాలయాలకు సంబంధించి 508 మంది వలంటీర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాలు వచ్చాయి. మిగిలిన వారు సేవామిత్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఉప్పాడ పంచాయతీ పరిధిలోని 4 సచివాలయాలకు సంబంధించి ఇద్దరు సేవావజ్ర అవార్డులకు, ముగ్గురు సేవారత్న అవార్డులకు ఎంపికయ్యారు. సేవావజ్ర అవార్డుకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవామిత్రలకు రూ.10 వేల చొప్పున పారితోషికం అందిస్తున్నారు. గత సంవత్సరంలో మండలంలో ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర, ఇద్దరికి సేవారత్న, 2021లో ఒకరికి సేవావజ్ర పురస్కారాలు వచ్చాయి.

సేవతో సంతృప్తి



గత ఏడాది కూడా సేవావజ్ర అవార్డును పొందాను. ఈ ఏడాది కూడా వజ్ర అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. మాలాంటి నిరుద్యోగులు జగనన్న వలంటీరుగా నియమించడమే కాకుండా అవార్డుల పేరుతో మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఎప్పుడూ రుణపడి ఉంటాం. ప్రజలకు సేవలు అందించడం తృప్తిగా ఉంది.

– కర్రి జ్యోతిర్మయి, ఉప్పాడ

కృతజ్ఞతలు



నేను సేవారత్న అవార్డు పొందాను. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయడం, ప్రజలకు సాయపడడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మొదటి సంవత్సరం కూడా నా సేవలను గుర్తించి సేవారత్న అవార్డు ఇచ్చారు.

– ఎర్రిపల్లి మేరీ, ఉప్పాడ

అదృష్టంగా భావిస్తున్నా..



నేను సేవారత్న అవార్డుకు ఎంపికయ్యాను. సీఎం వైఎస్ జగన్ మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థలో పని చేయటం అదృష్టంగా భావిస్తున్నా. ప్రతి నెలా రేషన్, పింఛన్ల పంపిణీ సహా ఎన్నో సంక్షేమ పథకాలను నా చేతుల మీదుగా అర్హులను గుర్తించి ఇవ్వడం గర్వంగా ఫీలవుతున్నాను.

– తోట వీరబాబు, ఉప్పాడ

మళ్లీ ఆయన రావాలి



నాకు సేవారత్న పురస్కారం వచ్చింది. ప్రజలకు మా వలంటీర్ల సేవలు కొనసాగాలంటే వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి రావాలనే నినాదంతో పని చేస్తాం. ప్రజలకు సేవ చేసే నాయకుడు సీఎం జగన్ ఒక్కరే.

– మల్లే సత్యానందం, పొన్నాడ

అంకిత భావంతో..



ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధిలా విధులు నిర్వర్తించటం చాలా సంతోషంగా ఉంది. ఎంతో అంకిత భావంతో పని చేస్తున్నాను. అందరికీ పథకాలు సకాలంలో అందిస్తున్నాను. ఏ ఉద్యోగంలోనైనా ఇంతకన్నా ఆత్మసంతృప్తి ఉంటుందా. నా పరిధిలోని కుటుంబాలు నన్ను గౌరవిస్తున్నాయి.

– సానా శివగంగారామకృష్ణ, కొత్తపల్లి

సంక్షేమ ఆశయ సారథులు వలంటీర్లు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదల చెంతకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక వీవీఎస్ ఆడిటోరియంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శాలువాలతో సత్కరించి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడమే లక్ష్యంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎల్లో మీడియా వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని, అవాస్తవాలను ప్రచురించడం వల్ల ఆ పత్రికల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చవకబారు రాజకీయాలు మానుకోవాలన్నారు. రాజకీయ లక్షణాలున్న వ్యక్తిలా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, కొత్తపల్లి, ఎండపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు మారిశెట్టి సత్తిబాబు, గుండ్ర రాజబాబు, సర్పంచులు నక్కా మణికంఠ, పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టం వస్తే గుర్తించేది వలంటీర్



ప్రజలకు ఏ కష్టం వచ్చినా మొదటిగా గుర్తుకు వచ్చేది వలంటీరే. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాల మంజూరుకు వలంటీర్ సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రారంభించి తొలి నాళ్లలోనే ప్రజామోదం పొందింది. ఉప్పాడ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సేవా పురస్కారాల్లో వజ్ర అవార్డులకు గత మూడు సంవత్సరాలుగా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది.

– శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి, ఉప్పాడ

పేదలను చూస్తే బాబుకు కడుపుమంట

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా పిఠాపురంలో భారీ బైక్ ర్యాలీ



పిఠాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: 'పేదల అభివృద్ధిని చూస్తే చంద్రబాబుకు కడుపు మంట, నిరుపేదల ఆశల హరివిల్లులైన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేదలకు క్షమాపణ చెప్పాలి' అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలం సెంటు భూమి కేవలం శవాలను కప్పెట్టడానికే సరిపోతుందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే దొరబాబు ఆధ్వర్యంలో పిఠాపురంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి సుమారు 1,600 మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరిన ఆయన పిఠాపురం కోటగుమ్మం సెంటర్, బజారు, చర్చి సెంటర్, మున్సిపల్ కార్యాలయం, పాదగయ సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, ఉప్పాడ సెంటర్ మీదుగా గొల్లప్రోలు చేరుకుని అక్కడి నుంచి చేబ్రోలు వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ, పేదలను లక్షాధికారుల్ని చేస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాను అధికారం చేపట్టిన వెంటనే పేదలకు సొంతింటి కల నెరవేర్చారని అన్నారు. ఒక్క సెంటు భూమి ఎందుకూ పని చేయదని, కేవలం శవాలను పూడ్చడానికే పనికొస్తుందని చంద్రబాబు విమర్శించడం పేదలను, వారి ఆశలను కాలరాయడమేనని మండిపడ్డారు. సెంటు భూమి ఇప్పుడు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఉందని అంటే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన సెంటు భూమితో నిరుపేదలు సొంతింటి కలను నెవేర్చుకోవడంతో పాటు లక్షాధికారులుగా మారారని చెప్పారు. తాను సీఎంగా ఉన్నప్పుడు అర సెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు.. ఇప్పుడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చూసి ఓర్వలేక నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. పేదలకు ఇచ్చిన భూమిని శ్మశానంతో పోల్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రికవరీ ఏజెంట్ మృతి

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ సమీపాన ఏడీబీ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం .. సామర్లకోట మండలం మేడపాడుకు చెందిన ఏడిద వీర వెంకట సూర్యనారాయణ (33) ఐసీఐసీఐ బ్యాంక్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తూ రమణయ్యపేటలో నివాసం ఉంటున్నాడు. స్నేహితుడిని స్కూటీపై సోమవారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దింపి, రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరాడు. నన్నయ పీజీ సెంటర్ సమీపానికి వచ్చేసరికి అతడి స్కూటీని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన సూర్యనారాయణ తలపై నుంచి లారీ చక్రాలు దూసుకుపోయాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యనారాయణకు ఏడాది క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై నాగార్జునరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు

ఏలేశ్వరం: స్నేహితుడిని కడతేర్చిన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడిని స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీఐ కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ, ఈ నెల 27న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోరాడ మణికంఠను కారుతో ఢీకొట్టి చంపిన బొంటు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశామని తెలిపారు. మణికంఠ తన కుటుంబాన్ని హతమార్చుతానని హెచ్చరించడంతో ఈ హత్య చేసినట్టు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. పట్టణంలో ఇటీవల అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టించుకోకపోతే దురలవాట్లకు బానిసై చెడు మార్గం పట్టే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎస్సై జి.సతీష్ కూడా పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలి

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని సీఐఎస్ఎఫ్ నర్సరీ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు వానపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన సోమవారం ఆమె పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల మేధస్సును వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దేశ, రాష్ట్ర, జిల్లా ప్రాముఖ్యత, హిందీ భాషలో మెళకువలను విమలారాణి వివరించారు.

మళ్లీ కుంభవృష్టి

- సామర్లకోట, పెద్దాపురాల్లో భారీ వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు



సామర్లకోట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం షెడ్ల నుంచి కురుస్తున్న వర్షపు నీరు



చెరువులా మారిన సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్



పెద్దాపురం మండలం వడ్లమూరులో ఒరిగిపోయిన అరటి తోట

సామర్లకోట: వరుసగా రెండో రోజు కూడా సామర్లకోటలో కుంభవృష్టి కురియడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం కూడా ఆకాశం చిల్లు పడిందా అన్న రీతిలో దాదాపు గంట పాటు కుండపోతగా భారీ వర్షం కురిసింది. రోహిణీ కార్తెలో ఎండలు ఎక్కువగా ఉంటాయని హడలెత్తిన వారికి ఈ వర్షాలు ఊరట కలిగించాయి. అయితే, భారీ వర్షానికి పట్టణంలోని అన్ని రోడ్లూ చెరువులను తలపించాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు డ్రైన్లలో పడిపోవడంతో వాటిల్లోని నీరు రోడ్లపై ప్రవహించింది. రైల్వే స్టేషన్‌లో రేకు షెడ్లను నాసిరకంగా నిర్మించడంతో వాటి నుంచి వర్షం బోరున కురిసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, సత్యనారాయణపురం, జయలక్ష్మీ థియేటర్, వెలమపేట, సంగీతరావుపేట, వీరరాఘవపురం, కొత్తూరు, భాస్కర్ నగర్, సాయి నగర్, గణేష్ కాలనీలు జలమయమయ్యాయి. డ్రైన్ల ఆక్రమణ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చెట్ల తొలగింపు

స్థానిక గాంధీచౌక్ వద్ద రైల్వే గేటు రోడ్డులో ఆదివారం సాయంత్రం ఈదురు గాలుల తాకిడికి కూలిపోయిన చెట్లను మున్సిపల్ కమిషనర్ సీఎంచే నయీం అహ్మద్ ఆధ్వర్యాన తొలగించారు. గాంధీ చౌక్ పిల్ల కాలువ ఆవలివైపు ఉన్న బురుగు చెట్లు రైల్వే విద్యుత్తు వైర్లపై పడిన విషయం తెలిసిందే. వాటిని రైల్వే అధికారులు వెంటనే తొలగించి రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. అయితే రోడ్డు మధ్యన నాలుగు చెట్లు పడిపోవడంతో రైల్వే గేటు మీదుగా రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. రైతులు తమ పశువులను ఈ గేటు మీదుగా తీసుకువెళ్తుంటారు. వారి ఇబ్బందిని గుర్తించిన మున్సిపల్ కమిషనర్.. సిబ్బంది సహకారంతో చెట్లను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు. అయితే అనేక ప్రాంతాల్లో పడి ఉన్న చెట్లను ఈపీడీసీఎల్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఇంకా తొలగించలేదు.

ఉద్యోగుల సేవలు భేష్

విద్యుత్ సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించిన ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బందిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అభినందించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం నాటి భారీ వర్షం, ఈదురు గాలులకు నియోజకవర్గంలో అనేక విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, ఈపీడీసీఎల్ సిబ్బంది రాత్రంతా కష్టపడి పని చేసి, చాలాచోట్ల సరఫరాను పునరుద్ధరించారని అన్నారు. మున్సిపల్, పోలీసు సిబ్బంది కూడా వర్షంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పని చేశారని దొరబాబు ప్రశంసించారు.

పెద్దాపురం.. అతలాకుతలం

పెద్దాపురం: మండలంలో కూడా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా విరుచుకపడిన ఈదురు గాలులు, భారీ వర్షానికి మండలం అతలాకుతలమైంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చాలాచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. ప్రధానంగా ఏటిపట్టు ప్రాంతంలోని వడ్లమూరు నుంచి గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, మర్లావ, తూర్పుపాకల గ్రామాల ప్రజలు నానా అవస్థలూ పడ్డారు. అరటి, చెరకు పంట నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. పులిమేరు రజక కాలనీలో మూడిళ్లపై భారీ చెట్టు కూలడంతో మూడు నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రెవెన్యూ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 25 స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గింది. ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది కృషితో సోమవారం సాయంత్రానికి చాలాచోట్ల సరఫరాను పునరుద్ధరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఉదయానికి కూడా విద్యుత్ సరఫరా జరగకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా జరిగేంత వరకూ తమకు తాగు నీటి ఇబ్బందులు తప్పవని ఏటిపట్టు గ్రామాల ప్రజలు అంటున్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

పిఠాపురం: ఈదురు గాలులు, భారీ వర్షానికి పిఠాపురం నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం పలు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు నేల కూలడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. విరిగి పడిన చెట్లను సోమవారం తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూశారు. ఒరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



సామర్లకోట గాంధీచౌక్ వద్ద చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



గొల్లప్రోలు మండలం చెందుర్తి రోడ్డులో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



పెద్దాపురం మండలం చదలాడ రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం



పెద్దాపురం మండలం పులిమేరులో భారీ వృక్షం కూలడంతో నేలమట్టమైన పూరిల్లు